క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా కట్టా


కట్టా వీరసూరి

కోరుకొండ: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా కట్టా వీరసూరి ఎంపికయ్యారు. ఆది, మంగళవారాల్లో అసోసియేషన్ సమావేశాలు నిర్వహించారు. దానిలో వీరసూరిని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. సంస్థ గౌరవాధ్యక్షుడు జి. రాజు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ పని చేస్తోందని, దీనికి బూరుగుపూడికి చెందిన కట్టా వీరసూరి ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ కార్యకలాపాల నిర్వాహణలో సూరి చురుకుగా పాల్గొన్నాడన్నారు.

ఏఐ ప్రాధాన్యంపై అవగాహన

ఆర్ట్స్ కళాశాలలో ఉపన్యాసం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో ఈ కామర్స్, డిజిటల్ ఎకానమీలో కృత్రిమ మేధస్సు భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. జర్మనీకి చెందిన శామ్యూల్ గల్లా వక్తగా హాజరై ఆయా అంశాలను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో రానున్న తరాల్లో దీనివల్ల పలు మార్పులు జరగనున్నాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, ఈ కామర్స్ ప్రాముఖ్యతను వివరించారు. కోఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏఏ అన్నపూర్ణ, డాక్టర్ బి.ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నాగరాజు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి పనికి వెళ్లిన తన తండ్రి తిరిగిరాలేదని హుకుంపేట రామకృష్ణనగర్‌కు చెందిన వెంపటి సాయి కుమార్ మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం హుకుంపేట రామకృష్ణనగర్‌కు చెందిన 50 ఏళ్ల వెంపటి నాగరాజు ఈనెల 26వ తేదీ ఉదయం బొమ్మూరుకు పెయింటింగ్ పనికివెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఒకసారి ఆయన భార్యకు ఫోన్ చేశారు. తరువాత నుంచి ఫోన్ పనిచేయలేదని, పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని సాయి కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాలాచెరువులో యువకుడు..


నరవ సాయిరాజు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి విధులకు వెళ్లిన తన కుమారుడు తిరిగిరాలేదని లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నరవ సత్యవతి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 30 ఏళ్ల నరవ సాయిరాజు ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 21వ తేదీన డ్యూటీకి అని ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తుంటే స్విచ్ ఆఫ్ వస్తోందని సత్యవతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మూరులో తల్లీకొడుకులు..


సంధ్య


మోక్షిత్ నారాయణ

రాజమహేంద్రవరం రూరల్: అంగన్‌వాడీ సెంటర్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లిన తన కుమార్తె, ఆమె ఏడాదిన్నర కుమారుడు కనిపించడం లేదని బొమ్మూరు వెంకటగిరికొండకు చెందిన ఆబోతుల లక్ష్మి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆబోతుల లక్ష్మి కుమార్తె 23 ఏళ్ల మడ్డి సంధ్యకు ఐదేళ్ల క్రితం ధవళేశ్వరానికి చెందిన సతీష్‌కుమార్‌తో వివాహం జరిగింది. వారికి నాలుగేళ్ల రాజిజ్ఞానేశ్వరి, ఏడాదిన్నర మోక్షిత్ నారాయణ సంతానం. సంధ్యకు సతీష్‌కుమార్‌తో మనస్పర్థలు రావడంతో నెల రోజుల నుంచి బొమ్మూరులోని తన తల్లి ఇంటి వద్దనే ఉంటుంది. మంగళవారం ఉదయం ఇద్దరు పిల్లలను తీసుకుని అంగనవాడీ సెంటర్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన సంధ్య ఎంతసేపటికీ రాకపోవడంతో ఆమె తల్లి లక్ష్మి అంగనవాడీ సెంటర్‌కు వెళ్లి అడుగగా సంధ్య కుమార్తె రాజిజ్ఞానేశ్వరి మాత్రమే ఉంది. తన కుమార్తె సంధ్య, తన ఏడాదిన్నర కుమారుడు మోక్షిత్ నారాయణను తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయిందని, ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై అంకారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సలసల.. కిలకిల.. జలజల..


రద్దీ లేక వెలవెలబోతున్న కోటిపల్లి బస్టాండ్ సెంటర్


అధిక ఉష్ణోగ్రత తట్టుకోలేక గోదావరిలో స్నానం చేస్తున్న ప్రజలు


మంగళవారం రాత్రి జోరుగా కురిసిన వర్షం

పగలంతా సలసలా వేగిపోయిన నగర ప్రజలు సాయంత్రం గోదారి గలగలల్లో ఉపశమించారు. అంతలోనే చెప్పాపెట్టకుండా వచ్చి ఆశ్చర్యపరిచిన ఆత్మీయునిలా రాత్రికి జలజలమంటూ కురిసిన వానతో నగర ప్రజలు సేద తీరారు. మధ్యాహ్నం దాటాక కూడా 42 డిగ్రీల ఉష్ణతాపంతో ఆపసోపాలు పడిన రాజమహేంద్రవరం ప్రజలు సాయంత్రానికి గోదారమ్మ చల్లని ఒడిలో జలకాలాడకుండా ఉండలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మంగళవారం విభిన్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కొన్న ప్రజలు చివరాఖరికి వానచినుకు పలకరింపుతో శుభం కార్డుతో రిలీఫ్ ఫీలయ్యారు.

తాగునీటికి కటకట

- నిర్లక్ష్యానికి గురవుతున్న సమగ్ర రక్షిత నీటి పథకం
- పైప్‌లైన్ల లీకేజీలతో సమస్య
- రూ.22 కోట్లతో నిర్మించిన పథకంపై అడుగడుగునా నిర్లక్ష్యం


బొమ్మూరులోని సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి గ్రామానికి సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యంతో దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు రూ.20 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి పథకం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతోంది. తరుచూ ప్రధాన పైప్‌లైన్లతో పాటు ఇతర ఉప లైన్లు లీకవుతుండడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి కడియం నియోజకవర్గమైన కడియం, రూరల్, రాజానగరం మండలంలోని గ్రామాలకు రక్షిత నీటిని అందించాలని రూ.22 కోట్లతో 2007లో బొమ్మూరు వెంకటగిరికొండపై 20ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. 2010లో దీనిని ప్రారంభించి ఆయా మండలాల్లోని గ్రామాలకు నీరందిస్తున్నారు. ఇది నిర్మించి 15 ఏళ్లు కావడంతో పైప్‌లైన్లు పాడై సరఫరాకు అవరోధాలు, లీకేజీలతో సమస్యలు ఏర్పడుతున్నాయి.

పదిరోజులుగా...

వాటర్ ప్లాంట్‌కు ధవళేశ్వరం గోదావరి నది నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్ ఎర్రకొండ వద్ద లీకవుతుండడంతో పది రోజులుగా మూడు మండలాలకు తాగునీరు నిలచిపోయింది. కడియం, రూరల్, రాజానగరం మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రజలకు వాడకానికి అక్కడి బోర్లు ద్వారా నీరు సరఫరా చేస్తారు. గోదావరి నీరు వచ్చే సమయంలో తాగునీటి కోసం పంచాయతీ సిబ్బంది నీటిని విడుదల చేస్తారు. పంచాయతీ నీరు, గోదావరి నీరు పుష్కలంగా వస్తే తాగునీటి ఎద్దడి ఉండదు. గోదావరి నీరు నిలిచిపోతేనే సమస్య. గత పది రోజులుగా తాగునీరు లేకపోవడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో హుకుంపేటకు వెళ్లే పైప్‌లైన్ లీకేజీని పూర్తిచేయడానికి సుమారు నెల రోజులు పట్టింది. ఆ లీకేజీల మరమ్మతుల కోసం తవ్విన గోతులను ఇప్పటి వరకు పూడ్చకపోవడం గమనార్హం. లీకవుతున్న ప్రధాన పైపులైను మరమ్మత్తులు చేస్తున్నామని, అవి పూర్తి కాగానే తాగునీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ (ప్రాజెక్టు) అధికారులు చెబుతున్నారు.


ధవళేశ్వరం ఎర్రకొండవద్ద లీకవుతున్న ప్రధాన పైప్‌లైను


హుకుంపేట చెరుకూరి గొడౌన్ల వద్ద మరమ్మతుల అనంతరం పూడ్చని గోతులు

తరుచూ లీకేజీలు



సమగ్ర సురక్షిత మంచినీటి పథకంలో తరుచూ లీకేజీలు ఏర్పడడంతో తాగునీరు సరిగ్గా రావడం లేదు. దీని వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పది రోజులుగా సురక్షిత నీరు రావడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాత పైప్‌లైన్ల స్థానే కొత్తవి అమర్చి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

–బత్తిన అప్పారావు, శాటిలైట్ సిటీ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమత్తుల దృష్ట్యా బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కలిగే అంతరాయం వల్ల దుర్గానగర్, మల్లయ్య పేట పెట్రోల్ బంక్ రోడ్, ఓటలంక, లూథరగిరి ఐటీఐ కాలేజీ ఏరియా, శ్రీరామ్ నగర్, వివేక్ బిర్యానీ ఏరియా, పేపర్ మిల్లు సాయి బాబా టెంపుల్ ఏరియా, బ్రదరన్ చర్చి ఏరియా, గిరిజన కార్పొరేషన్ ఏరియా, చెరుకూరి ఏరియా, విద్య నగర్, వీవర్స్ కాలనీ, రావి చెట్టు, చర్చ్ ఆఫ్ గాడ్, గణేష్ నగర్, పీఅండ్‌టీ కాలనీ, పోస్ట్ ఆఫీస్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు కలిగే అంతరాయంతో నందం గనిరాజు సెంటర్, జాంపేట, కంబాలపేట, గణేశ్ చౌక్ ప్రాంతం, అన్నపూర్ణమ్మపేట, మాధవ్ సింగ్‌పేట, జాంపేట పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పన్ను చెల్లింపులో రిబేట్‌కు నేడే తుది గడువు

రాజమహేంద్రవరం సిటీ: ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రిబేటు, పెండింగు బకాయిలకు 50 శాతం పెనాల్టీలో రాయితీ అవకాశం ఆదివారంతో ముగియనుంది. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. ఇంకా పన్ను చెల్లించని యజమానులు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందిని కలసి పన్ను చెల్లించాలని కోరారు. పన్నులు చెల్లించేందుకు ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసామన్నారు. సచివాలయాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 వరకు, ఆర్‌ఎంసీలో ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వృత్తి విద్యా శిక్షకులకు ట్యాబ్‌ల పంపిణీ



వృత్తి విద్యా శిక్షకులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎస్తేరు రాణి

కంబాలచెరువు: వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించిన వారు జీవితంలో త్వరగా స్థిరపడతారని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్తేరు రాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో వృత్తివిద్యా శిక్షకులకు మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వయం ఉపాధికి వృత్తివిద్యా కోర్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ జిల్లా అడిషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఒకేషనల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

రేపు కార్మిక జోజప్ప పండుగ

కోరుకొండ: కార్మిక జోజప్ప పండుగను గురువారం నిర్వహిస్తున్నట్టు ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ తెలిపారు. మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం ఊరేగింపు, అనంతరం ఆరాధన ఉంటాయన్నారు.

నర్సరీ సందర్శన

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ప్రముఖ విజ్ఞాన శాస్త్రవేత్త, బౌద్ధ చరిత్ర రచయిత, బుద్ధ భూమి ప్రధాన సంపాదకుడు బొర్రా గోవర్ధన్ మంగళవారం సందర్శించారు. పలు రకాల మొక్కలను గురించి ఆయనకు నర్సరీ రైతు పల్ల సుబ్రహ్మణ్యం వివరించారు. ఆయన వెంట గోలి సీతారామయ్య, వేమగిరి బుద్ధ విహార వ్యవస్థాపకుడు యార్లగడ్డ మైత్రేయ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ కార్యక్రమాలు విస్తృతం చేయాలి

- నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళిక
- సభ్యత్వాల నమోదుకు ప్రత్యేక డ్రైవ్
- జిల్లా అధ్యక్షురాలు, కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని, దీని కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సభ్యత్వ నమోదు చేయాలని జిల్లా సొసైటీ అధ్యక్షురాలు, కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రతీ నెలా ఒక కార్యక్రమం ద్వారా రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జిల్లాలో బ్లడ్ బ్యాంక్ కోసం ప్రతిపాదనలు పంపాలని, ఇందుకు సంబంధించి అన్ని విధాలుగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్థిక లావాదేవీల కార్యకలాపాలు కోసం క్యూ ఆర్ కోడ్ తప్పనిసరి చేయాలని, యూనియన్ బ్యాంకు నుంచి ఖాతా ప్రారంభించాన్నారు. రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 8వ తేదీన నేత్ర, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. రెడ్ క్రాస్ డొనేషన్ పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులను కూడా సభ్యులుగా చేర్చేలా అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి ఎస్.సరళా వందనం, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి, కలెక్టరేట్ ఏవో ఎండీ అలీ, క్రియాశీలక సభ్యురాలు డాక్టర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులతో గౌరవంగా మెలగాలి

రాజమహేంద్రవరం సిటీ: పెట్రోల్ బ్యాంకుల్లో వినియోగదారులతో గౌరవంగా మెలగాలని, నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు సూచించారు. మంగళవారం జిల్లాలోని గోకవరం మండలంలోని భారత్ పెట్రోల్ బంక్ సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదు మేరకు బంకును సందర్శించి సిబ్బందిని హెచ్చరించారు. వినియోగదారులకు గాలి, నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, మరుగు దొడ్డి లాంటి సేవలు ఉచితంగా అందించాలని బంకు నిర్వాహకులకు సూచించారు. ఫిర్యాదులు ఉంటే లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లై, సంబంధిత సేల్స్ ఆఫీసర్ కు తెలియజేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సిబ్బంది ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేయరాదన్నారు. సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేస్తామని అనంతరావు తెలిపారు.

అధునాతన వైద్యంపై పీఎంపీలకు అవగాహన


వైద్య నిపుణులను సత్కరిస్తున్న ది పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి

రాజమహేంద్రవరం రూరల్: పీఎంపీలు ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలపై అవగాహన పొందడం అవసరమని పీఎంపీ జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తోరాటి మాట్లాడుతూ ఈ సదస్సులు ప్రజలకు మేలైన వైద్యాన్ని అందించేందుకు ఉపకరిస్తాయని అన్నారు. కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మణికంఠ చౌదరి హాజరై అధునాతన శస్త్రచికిత్సల గురించి, డాక్టర్ ఆనంద్ చౌదరి అత్యాధునిక రోబో సర్జరీ ట్రీట్‌మెంట్ గురించి, డాక్టర్ పి.ప్రశాంత్ అత్యవసర ట్రామా కేసులలో పీఎంపీలు అందించే చికిత్సలను వివరించారు. అలాగే వైద్యులు టి శ్రీదేవి, ఎం.ఆదిత్య, రవితేజ తదితరులు పలు వైద్య విధానాలను వివరించారు. కార్యక్రమానికి సహకరించిన హాస్పిటల్ సీఈఓ డాక్టర్ రామరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షుడు కేఎస్ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వైద్యనిపుణులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఆన్‌లైన్ సేవలు బంద్

- జాంపేట బ్యాంక్ ఖాతాదారుల అవస్థలు
- చిన్న లావాదేవీకీ బ్యాంకుకు వెళ్లాల్సిందే
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక జాంపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకులో నెల రోజులుగా డిజిటల్ లావాదేవీలు పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. 1926లో ప్రారంభమైన ఈ బ్యాంక్ రాష్ట్రంలో 13 శాఖలతో సుమారు 650 కోట్ల వ్యాపారంతో సుమారు 18 వేల మంది ఖాతాదారులతో కొనసాగుతోంది. ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయం నగరంలోని జాంపేటలో ఉంది. కాగా సీతంపేట, మోరంపూడి శాఖలతో పాటు కాకినాడ, అనపర్తి, గోకవరం, ఏలూరు, పెద్దాపురం, ధవళేశ్వరం, భీమవరం, కొవ్వూరు, రావులపాలెంలలో బ్యాంకుకు శాఖలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శాఖలన్నింటిలో మార్చి 30వ తేదీ నుంచి యూపీఐ, నెఫ్ట్, ఏటీఎం, ఆన్‌లైన్ సేవలు నిలచిపోవడంతో ఖాతాదారులు చిన్న లావాదేవీకి సైతం బ్యాంకు శాఖలకు రావల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ పరిస్థితిపై ఖాతాదారులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు కానీ, పాలకమండలి కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. వాస్తవానికి సమస్య తలెత్తిన ఒకటి రెండు రోజుల్లోనే సాంకేతిక సమస్యను పరిష్కరించి ఆన్‌లైన్ లావాదేవీలను పునరుద్ధరించాల్సి ఉంటుంది. దివంగత బొమ్మన రాజ్‌కుమార్ ఛైర్మన్‌గా ఉండగా ఇటువంటి సమస్యలు ఎన్నడూ ఎదురవలేదని ఖాతాదారులు అంటున్నారు.

ఈ సమస్యపై బ్యాంక్ సీఈఓను వివరణ కోరగా సర్వర్ సమస్య వల్ల ఆన్‌లైన్ సేవలు నిలచిపోయాయని, ముంబై వేదికగా సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం రాత్రికి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు.


మూతపడిన ఏటీఎం కౌంటర్


బ్యాంక్ ఎదుట డిజిటల్ సేవలు పనిచేయడం లేదంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


జాంపేట కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం

రూ.10 లక్షల మేర ఆదాయానికి గండి



నెల రోజులుగా డిజిటల్ సేవలు పనిచేయకపోవడం వల్ల సుమారు రూ.10 లక్షల మేర బ్యాంకు ఆదాయాన్ని నష్టపోయింది. డిజిటల్ సేవల ద్వారా ఏటా కోటి రూపాయల పైబడి ఆదాయాన్ని సాధిస్తోంది. ఈ నెల 18వ తేదీన బ్యాంక్‌కు వెళ్లి అడగగా రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఏప్రిల్ 29వ తేదీ వచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. డిజిటల్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల వృద్ధులు, మహిళలు బ్యాంక్‌కు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– కటకం వెంకట మల్లికార్జునరావు, రాజమహేంద్రవరం

సేవలు లేకపోవడం దారుణం

ఆర్థిక లావాదేవీలతో కొనసాగే బ్యాంక్‌లో డిజిటల్ సేవలు నెలరోజులుగా ఆగిపోవడం సరైన విధానం కాదు. ఖాతాదారులకు మెరుగన సేవలు అందిచాల్సిన పాలక మండలి యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కరించాలి. అటువంటి పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలి. ఏ చిన్న లావదేవీకైనా బ్యాంక్‌కు వెళ్లాల్సివస్తోంది.

– అల్లాడ సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హైవే వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


పొట్టిలంక వద్ద హైవే వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కడియం: మండలంలోని పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే క్లీనింగ్ వాహనాన్ని రావులపాలెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు పొట్టిలంక వద్ద హైవే రోడ్డు క్లీనింగ్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు, ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో గాయపడిన వారిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కాగా బస్సు ఢీకొట్టిన వేగానికి హైవే క్లీనింగ్ వాహనం డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఘటనా స్థలానికి పోలీసులు, హైవే సిబ్బంది చేరుకుని ట్రాఫిక్‌కు అవాంతరం లేకుండా చర్యలు చేపట్టారు.